


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు





సంపుటి : 18 | సంచిక : 08 | ఏప్రియల్ 2013



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


ఐభీమవరం..... 01-09-2011

పాలమూరు.... 28-02-2013



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-09-2011, ఐభీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవాన్ శ్రీ రమణమహర్షిగారు సెప్టెంబరు ఒకటవ తేదీన సూర్యుడు ఉదయించే టైములో అరుణాచలం విచ్చేయటం జరిగింది. భగవాన్ స్వగ్రామం తిరుచ్చుళి. మధురైలో పినతండ్రిగారి ఇంటివద్ద భగవాన్ కొంతకాలం చదువుకున్నారు. ఆయన పదవ తరగతి చదువుకునేటప్పుడు 1896వ సంవత్సరం జూలై 16వ తేదీన ఆయనకు మరణానుభవం కలిగింది. ఆయనకి మరణానుభవం అనేది పుస్తకాలు చదవటం వలనకాని, ధ్యానం చేయటంవలనకాని, జపం చేయటం వలన కాని అది రాలేదు. అసలు బ్రహ్మపదార్థం ఒకటి ఉందని కూడా ఆయనకు తెలియదు. మరి మరణానుభవం ఎలా కలిగింది అంటే అది దేవరహస్యం అయిఉండవచ్చు, అది మనబుద్ధికీ, మన ఇంద్రియాలకీ అందని విషయం. మరణానుభవం పొందినప్పుడు భగవాన్ దేహము తోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి పూర్తిగా విడిపోయారు. ప్రపంచం లేని స్థితి, దేవుడులేని స్థితి, ఇంద్రియాతీతమైన స్థితిని సాధనతోటి సంబంధం లేకుండా కేవలము ఈశ్వరానుగ్రహము వలన ఆయన ఈశ్వరుని స్వరూపం పొందారు. మరణానుభవం కలిగిన తరువాత ఆరు వారాలకి భగవాన్ అరుణాచలం వచ్చేసారు. ఏమీ కష్టం లేకుండా, సాధన చేయకుండా సద్వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చింది. మేము బ్రహ్మమును తెలుసుకోవటానికి చాలా కష్టపడుతున్నాము అయినా మాకు తెలియటంలేదు అని భగవాన్‌ని అడిగితే, ఈ జన్మలో మీరు ఏదైతే కష్టం, కష్టం అనుకుంటున్నారో, ఆ కష్టం నేను పూర్వజన్మల్లో పడి ఉండవచ్చును అని చెప్పారుకాని అతిశయోక్తి మాటలు ఏమీ భగవాన్ చెప్పలేదు. ఈ ఆధ్యాత్మికజీవితంలో మీ మాటలోగాని, మీ ప్రవర్తనలోగాని, మనస్సులోగాని ఆడంబరం ఉండకూడదు. నిరాడంబరంగా ఉండాలి. ఇది చాలా ముఖ్యం.

హృదయంలో ఉన్న సద్వస్తువుని తెలుసుకోవాలంటే బహుజన్మల

సాధన చెయ్యాలి అని పరమాత్మ గీతలో చెప్పాడు. బహుజన్మల సాధన చేసి లోపల ఉన్న కల్మషంలో నుండి భేదబుద్ధిలో నుండి విడివడాలి. విడివడిన తరువాత కూడా భగవంతుడు తెలుస్తాడని చెప్పలేము. మీరు చేసే పనులు ఇష్టంగా చేస్తున్నారా? అయిష్టంగా చేస్తునారా? మీరు లోపల పుల్లగా ఉన్నారా? తియ్యగా ఉన్నారా? ఇవన్నీ చూచుకొని మనకు అర్హత ఉందో లేదో చూస్తాడు. అర్హత ఉన్నా తెలియబడతాడని లేదు. ఆయన దయ లేకుండా మనం ఆయనను పొందలేము. పరమేశ్వరుడు భగవాన్‌ను ఎన్నుకున్నాడు. పరమాత్మ ఆయనను ఎన్నుకోటం వలన ఆయనకు సద్వస్తువు తెలియబడింది. ఈ అనుభవం అయిన తరువాత ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఇది వరకు జతపిల్లలు ఒక దెబ్బకొడితే రెండు దెబ్బలు వేసేవాడు. ఈ అనుభవం వచ్చిన తరువాత ఎవరైనా కొట్టినా తిరిగి కొట్టేవాడు కాదు. ఇది సంతోషం అనిలేదు, ఇది దుఃఖం అని లేదు, అదృష్టాలు, దురదృష్టాలు అని లేవు ఈ ద్వంద్వాలలోంచి ఆయన విడిపోయారు. ఆయన అరుణాచలంలో 54 సంవత్సరాలు ఉన్నారు. ఆయన ఒక మాట చెప్పారు. ఈ అరుణాచలం విడిచిపెట్టి మరోచోటికి వెళదామనే తలంపు కూడా నాకు రాలేదు అన్నారు. అంటే తలంపు వచ్చిన తరువాత నిగ్రహించుకోవటంకాదు అది జన్మాంతర అనుబంధం. ఆ దేహం యొక్క ప్రారబ్ధము ననుసరించి ఆయన శరీరం చనిపోయేవరకు ఆ క్షేత్రంలో ఉండవలసి ఉంది. మన భారతదేశంలో జన్మించినటువంటి అవతారపురుషులు, మహర్షులు అందరూ కూడా పుణ్యక్షేత్రాలు చూచి వచ్చారు. భగవాన్ అలా ఎక్కడికి తిరగలేదు. ఎక్కడికి తిరిగినా చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీ లేదు, తెలుసుకోవటానికి ఏమీ లేదు అన్నారు భగవాన్. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే.

మనం జ్ఞానానికి దూరంగా ఉన్నాము, లోకానికి దగ్గరగా ఉన్నాము. మీ లోపల వాసన ఉంది కాబట్టి అస్తమానూ లోకానికి సంబంధించిన విషయాలు మీకు వినాలని ఉంటుంది. ఒక్క బ్రహ్మము గురించి తప్పించి ఏ విషయాలు మాట్లాడినా, అటువంటి మాటలు నాతోటి చెప్పకండి అనేవారు భగవాన్. దేనికీ ఆయన ఆశ్చర్యపడలేదు. ఎందుచేత నంటే ఏ సంఘటన ఈశ్వరుడికి తెలియకుండా జరగటానికి వీలులేదు. ఈశ్వర సంకల్పాన్ని బట్టే అది జరిగింది అనేవారు భగవాన్. భగవంతుడు దయాసముద్రుడే కాదు, నిరంకుశుడు కూడా. ఉపపాండవులను అశ్వద్ధామ చంపేసాడు. కృష్ణా మేము నీకు భక్తులం కదా, ఉప పాండవులు ఒకేసారి చనిపోయారు. మాకు ఇటువంటి పరిస్థితులు తీసుకువస్తున్నావేమిటి? అని ద్రౌపది కృష్ణుడిని అడిగింది. కృష్ణుడు ఏమన్నాడు అంటే ఉరితీసేవాడికీ, దేవుడికీ జాలి ఉండదు. జాలి ఉంటే ఉరితీసేవాడు ఉరి తీయలేడు. నువ్వు మాకు భక్తురాలివే కానీ కర్మ ఫలితం ఇచ్చేటప్పడు వీళ్ళు మన భక్తులు మనం నిగ్రహించుకోవాలి అని ఏమీ ఉండదు. ఆ టైము వచ్చేటప్పటికి కర్మఫలితం ఇచ్చేస్తాము. కర్తురాజ్ఞయా ప్రాప్యతేఫలం. అయితే భగవాన్ ఏమంటారు అంటే ఉరితీసేవాడు, తీయబడేవాడు ఈ రెండూ మనం దాటివెళ్ళిపోవాలి. తనువు తాను కాదని తెలిసినవాడిని దేవుడు ఏం చేస్తాడు? కర్మఫలితం ఏం చేస్తుంది?

జగత్తుతోటి, జీవుడితోటి, ఈశ్వరుడితోటి సంబంధం లేకుండా వీటి అన్నింటికి అతీతంగా మిమ్మల్ని తీసుకుపోవటమే ఆయన పని. ఇది రమణ సిద్ధాంతం.

నీకు దేహబుద్ధిని ఎందుకు పెట్టాడు అంటే నువ్వు పూర్వజన్మలో చేసిన కర్మని నీచేత అనుభవింపచేయటానికి పెట్టాడు. నీకు దేహబుద్ధి లేకపోతే దేవుడు నిన్ను ఏమీ చేయలేడు. దేహమనే కట్రాడుకి ఈ జీవుడు అనే దూడను కట్టేసి పూర్వజన్మకర్మానుసారం కొట్టటం మొదలుపెట్టాడు. రమణమహర్షిగారు చెప్పింది ఏమిటి అంటే నువ్వు తాడు తెంపేసుకొని వెళ్ళిపో. అప్పడు భగవంతుడు ఏమి చేస్తాడు అంటున్నారు తాడు తెంపేసుకొని దూడ వెళ్ళిపోతే యజమాని ఏంచేస్తాడు? దూడ కట్రాడుకు కట్టబడి ఉంటే నాలుగు దెబ్బలు కొడతాడు, అది తాడు తెంపేసుకుంటే ఇంక యజమానికి దొరకదు కదా! అలాగే మీరు కూడా ప్రకృతిని దాటి వెళ్ళిపోండి. దేవుడు కూడా మిమ్మల్ని ఏమీ చేయలేడు. రమణ మహర్షిగారు పొందిన అమృతానుభవం మీకు కూడా కలిగింది అనుకోండి, మీకు దేహబుద్ధి పోయిందనుకోండి అప్పడు దేవుడు చేసేది ఏమీలేదు, కర్మని మీరు విడిచిపెట్టటంకాదు, కర్మే మిమ్మల్ని విడిచిపెట్టి పారిపోతుంది. మీ శరీరం చనిపోయిన తరువాత కాదు, మీ శరీరం ఉండగానే మీ మనస్సుకు లోచూపు కలిగి అంతర్యామి ఎంత లోతుల్లో ఉన్నాడో అంతలోతులోకి వెళ్ళి అంతర్యామిని టచ్ చేస్తూ ఉంటే అప్పడు బాహ్యంగా మిమ్మల్ని ఎవరైనా సన్మానం చేసినా, అవమానం చేసినా ఎర్రచీమ కుట్టినట్టుకూడా ఉండదు. ఆ గోడకు చేస్తే ఎలా ఉంటుందో, మీకు అలాగే ఉంటుంది. లోపల అవమానపడేవాడు ఉన్నప్పడు ఎవడో ఒకడు అవమానపరచగలడు. మీరు అవమానాలకీ, బహుమానాలకీ అతీతంగా వెళ్ళిపోయారు అనుకోండి మిమ్మల్ని దేవుడు ఏంచేస్తాడు? మీ శరీరం చనిపోకముందే ఆ స్థితికి మిమ్మల్ని తీసుకుపోవటానికి వచ్చిన అవతారమే రమణావతారం.

పరమేశ్వరుడు ఆయనపట్ల భక్తి ఎలా కలుగుతుందో ఆయనే చెబుతున్నాడు.

**బ్రహ్మభూతః ప్రసన్నాత్మా నశోచతి నకాఙ్క్షతి,**
**సమస్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ (గీత 18-54)**

బ్రహ్మరూపమును పొందినవాడు, నిర్మలమైన మనస్సుగలవాడు దేనిని గూర్చియు దుఃఖింపడు. దేనిని కోరడు. సమస్త ప్రాణులందును సమబుద్ధిగలవాడే నాయందు ఉత్తమభక్తిని పొందుచున్నాడు.

కోరికలేనివాడికి, శోఖములేనివాడికి, జీవకోటిపట్ల సమానమైన బుద్ధిగలవాడికి మాత్రమే నాపట్ల భక్తి కలుగుతుంది. లేకపోతే నాపట్ల భక్తి కలుగదు అంటున్నాడు పరమాత్మ. స్త్రీకి మంచి భర్త దొరికితే మేము అదృష్టవంతులం అనుకుంటారు. భర్తకి మంచి భార్య దొరికితే మేము అదృష్టవంతులం అనుకుంటారు. ధనవంతులందరినీ మనం అదృష్టవంతులు అనుకొంటున్నాము. కానీ ఎవడికైతే ప్రసన్నమైన హృదయం ఉందో, లోతైన హృదయం ఉందో, సర్వకాల సర్వావస్థల్లో బ్రహ్మముతోటి ఏకమై శాంతముగా ఉంటాడో, ప్రారబ్ధం మనకి

అనుకూలంగా ఉన్నా, ప్రారబ్ధం మనకి వ్యతిరేకంగా ఉన్నా సర్వకాల సర్వావస్థలలో ఒకే రకంగా ఉంటున్నాడో వాడు అదృష్టవంతుడు అని పరమాత్మ చెప్పాడు. ఎప్పుడూ శాంతిలో, సుఖములో, ఆనందములో ఊగిసలాడేవాడికి దుఃఖము ఎక్కడ ఉంది? కోరిక ఎక్కడ ఉంది? వర్షాకాలంలో నదులలో నీరు సముద్రంలో కలుస్తాయి. వేసవికాలంలో నదులలో నీరు సముద్రంలోనికి రావు. సముద్రం వర్షాకాలంలో ఒకరకంగా, వేసవికాలంలో ఒకరకంగా ఉండదు. సముద్రానికి వర్షాకాలంలో పొంగూలేదు, వేసవికాలంలో కుంగూ లేదు. సముద్రం ఎప్పుడూ ఒకేరకంగా నిండుగా ఉంటుంది. అలాగే జ్ఞానికూడా పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా లోపల నిండుగానే ఉంటాడు. వాడికాళ్ళమీద వాడు నిలబడి ఉంటాడు కాని బాహ్యపరిస్థితుల మీద ఆధారపడడు. బాహ్యపరిస్థితుల మీద ఆధారపడితే వాడు జ్ఞాని కాడు.

**వివిక్త సేవీ లఘ్వాశీ యతవాక్కాయ మానసః,**
**ధ్యాన యోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః (గీత 18-52)**

వివిక్తసేవీ అంటే ఏకాంతవాసంగా ఉండటం నేర్చుకోండి. సత్పురుషులతోటి సహవాసం చేయకుండా సద్గుణాలు కలగవు. సజ్జనసాంగత్యం లేకుండా భగవంతుడిని తెలుసుకోవాలనే బుద్ధి మనకు కలుగదు. రోజూ ఒకగంట ఏకాంతంగా గడపండి. ఏకాంతంగా కూర్చుంటే మీ మనస్సులో ఏముందో మీకు తెలుస్తుంది. ఏకాంతవాసం స్కేనింగు లాంటిది. పదిమందిలో కూర్చున్నప్పుడు మీ మనస్సులో ఏముందో మీకు తెలియదు. లఘ్వాశీ అంటే ఆహారవిషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మితంగా తినాలి. మీ శరీర యాత్ర నడవటానికే తినండి. తినటంకోసం బతకకండి. ఆహారవిషయంలో మనకి గురువుగారు మహాత్మాగాంధీ. పండుగరోజున కూడా భోజనం దగ్గర రాజీపడరు. యతవాక్కాయ మానసః అంటే మాట, శరీరము, మనస్సు ఈ మూడింటిని మీకు జ్ఞానం కలిగేలాగ ఉపయోగించు కోవాలి. శరీరం ఉందని మీ ఇష్టం వచ్చినట్టు ఉపయోగించకూడదు. మనస్సు ఉందని మీ ఇష్టం వచ్చినట్టు ఆలోచించకూడదు. నోరు ఉందని మీ నోటికి వచ్చినట్టు మాట్లాడకూడదు. పుణ్యం తెచ్చినా, పాపం తెచ్చినా ఈ మూడే. నిత్యం ఇది రాత్రి, ఇది పగలు అని భేదం లేకుండా 24 గంటలూ మీ మనస్సులోకి మంచి ఆలోచనలు, మంచి తలంపులు వచ్చేలాగ చూచుకోండి. ఈ మూడూ మీరు ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవటానికి అనుగుణంగా ఉపయోగించుకోండి. కానీ వీటిని భోగాలకి ఉపయోగించవద్దు.

ధ్యానయోగపరో అంటే నువ్వు ధ్యానం చేసుకుంటూ ఉండు. ఈ లోకంలోకి మనం ఎందుకు వచ్చాం? ఈ లోకానికీ మనకీ ఉన్న సంబంధం ఏమిటి? ఇంట్లో వాళ్ళకి మనకి సంబంధం ఏమిటి? మనం ఎవరి వాళ్ళం? ఎవరు మనవాళ్ళు? ఎవరికీ ఎవరూ ఏమీ సంబంధం లేదు. కళ్ళు మూస్తే ఏముంది? ఈ మానవతా సంబంధాలు అన్నీ మనస్సు యొక్క కల్పితం. మనస్సుతోటి చేసుకునే ప్రేమలు, మనస్సుతోటి చేసుకునే నిర్ణయాలు నిలబడవు. ధ్యానం అంటే మీకు ఇష్టమైన దేవుడు రూపంమీద మనస్సు నిలబెట్టటం, ఆ నామాన్ని స్మరించుకుంటూ ధ్యానం చేయవచ్చు. లేకపోతే హృదయంలో ఉన్న సద్వస్తువు

మీద కూడా ధ్యానం చేయవచ్చు. ధ్యానం చేయటం వలన లాభం ఏమిటి అంటే ఇతర తలంపులు రావటం ఆగిపోతాయి. వైరాగ్యం ఉన్నప్పుడు వాడి మనస్సు ఎక్కడైనా వాలినా ఏదీ నాదికాదని వాడికి తెలుస్తూ ఉంటుంది. నాది కాదని తెలిసినప్పుడు దానియందు ఇష్టంరాదు. ఎక్కడైతే వైరాగ్యం ఉందో అక్కడ సుఖం ఉంటుంది. ఆనందం ఉంటుంది. ఈశ్వరుడు నీలో అంతర్యామిగా ఉన్నాడు. నీ శరీరముకంటే, నీ మనస్సుకంటే, నీ ఇంద్రియాలు కంటే, నీ బుద్ధికంటే దగ్గరగా ఉన్నాడు. వాడిని ఆశ్రయించటం నేర్చుకో, వాడికి శరణాగతి చేస్తే ఈ ప్రకృతి గుణాలనుండి విడుదలపొందుతావు. ఈ ప్రకృతి గుణాలని దాటకుండా ఆత్మజ్ఞానం పొందటానికి నీకు అర్హతరాదు.

దేహము నేను అనే తలంపు ఉన్న ప్రతీవాడికి లోపలా బయట ఉంటుంది. లోపలా, బయటా ఉన్నవాడికి కల్మషం ఉంటుంది. పూర్వజన్మల వాసనల్ని బట్టి ఆ కల్మషం వస్తుంది. అందులోనుండి నువ్వు విడుదలపొందాలి. దానికి సాధన చెయ్యాలి. నువ్వు సొంతంగా సాధన చెయ్యలేకపోతే సజ్జనసాంగత్యం చెయ్యమన్నాడు రామకృష్ణుడు. వేసవికాలంలో చల్లటి గాలి వచ్చి నీ శరీరాన్ని తాకుతూ ఉంటే నీకు ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో సజ్జనసాంగత్యం అటువంటిది. సజ్జనసాంగత్యం ఎందుకు అంటే వాళ్ళు సంపాదించుకున్నదాంట్లో నీకు వాటా పంచిపెడతారు. నీ మనస్సులో ఏ కల్మషాలు ఉన్నాయో, ఏ బలహీనత ఉందో నువ్వు చూచుకోవాలి. అది మీకు తెలుస్తూ ఉంటుంది. నీ మనస్సు ఎక్కడికి వెళుతోందో చూచుకుని దానిని వెనక్కిలాగి భగవంతుడియందు నిలబెట్టు. నీ మనస్సు ఆ బలహీనత మీద వాలకుండా చూసుకో. అప్పుడు నువ్వు కల్మషంలోంచి బయటకు వస్తావు, నిరంతరం శాంతచిత్తము కలిగినవాడికి, రజోగుణం అణిగినవాడికి, కల్మషం లేనివాడికి మామూలు సుఖంకాదు, ఉత్తమసుఖం కలుగుతుంది. ఏ సుఖమును పొందిన తరువాత దానికి మించిన సుఖంలేదని మీకు తెలుస్తుందో, ఏ శాంతిని పొందిన తరువాత దానికి మించిన శాంతి లేదని తెలుస్తుందో అటువంటి శాంతిని, సుఖాన్ని నాపట్ల భక్తివలన, నన్ను శరణాగతి పొందటంవలన పొందుతారు అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఆ నిర్వాణసుఖాన్ని పొందటానికే కదా బుద్ధుడు ఇల్లువిడిచిపెట్టి వెళ్ళిపోయాడు.

పరమాత్మగీతలో ఏమని చెప్పాడంటే, మీకు లోకంలో అందరూ విరోధులు ఉన్నా ఫరవాలేదు మీ మనస్సుని మీరు స్నేహితుడిగా చేసుకోండి. మనస్సు మీ స్వాధీనంలో లేకపోతే లోకంలో ఉన్నవాళ్ళు అందరూ కలిసినా మీకు ఏమీ ఉపకారం చేయలేరు. వాళ్ళు మిమ్మల్ని సుఖపెట్టాలన్నా సుఖపెట్టలేరు. అందుచేత అర్జునా ఇతరుల గొడవ నీకు ఎందుకు? నీ మనస్సు ఇప్పుడు నీకు శత్రువుగా ఉన్నాడా? స్నేహితుడుగా ఉన్నాడా? శత్రువుగా ఉంటే స్నేహితుడిగా మార్చేసుకో. నీ మనస్సు నీకు శత్రువు అయితే బయట ఉన్న శత్రువులు కంటే ఈ మనస్సు అనే శత్రువు నీకు ఎక్కువ అపకారం చేస్తుంది. మీకు భగవంతుడు శిక్ష వెయ్యనక్కరలేదు. మీ మనస్సే మీకు శిక్ష. అందుచేత అర్జునా! నీ మనస్సుని సంస్కరించుకో. నీ మనస్సును మిత్రుడిగా చేసుకో. నీ మనస్సుని నియమించుకోవటంకంటే గొప్పపని లేదు,

గొప్ప సాధన లేదు. స్కూలులో పిల్లలు గ్రౌండులో ఆడుకుంటారు. అలాగే నీ మనస్సు నీ ఇంద్రియాలు కల్పించిన విషయాలలో ఆడుకుంటోంది. అందులోనుండి నీ మనస్సుని ఉపసంహరించుకోవాలి. ఎక్కడివరకూ ఉపసంహరించాలంటే, నీ మనస్సు ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడికి వెళ్ళి అణిగిపోయేవరకూ, అది ఆత్మాకారం చెందేవరకూ ఉపసంహరించు, ఉపసంహరించు, ఉపసంహరించు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-02-2013, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన అశాంతికి మనలోపల ఉన్న శత్రువులే కారణం. బయటఉన్న శత్రువులకంటే మన లోపలఉన్న శత్రువుల వల్లనే మనకు ఎక్కువ ప్రమాదం ఉంది. అంటే బయటఉన్న శత్రువులకంటే మనలోపలఉన్న శత్రువులే మనకు ఎక్కువ అపకారం చేస్తారు. మన శరీరం స్మశానంలో కాలిబూడిద అయినప్పుడు మనలోపలఉన్న శత్రువులు బూడిద అవ్వరు. ఎందుచేతనంటే అవి మన శరీరంలో ఉండవు, జీవుడిలో ఉంటాయి. స్మశానంలో శవాన్ని దహనంచేసినప్పుడు శరీరం బూడిద అయిపోతుందికాని జీవుడు అలాగే ఉంటాడు. అంటే శరీరం చనిపోయినప్పుడు ఆ శరీరగతమైన చరిత్ర ముగిసిపోతుంది కాని జీవుడి యొక్క చరిత్ర ముగియదు. అంటే ఆ దేహానికి సంబంధించిన బంధువులు, స్నేహితులు, విరోధులు, పరిసరాలు, దేహగతమైన విషయాలు అన్నీ ముగిసిపోతాయి కాని జీవుడి యొక్క యాత్ర ముగియదు. గుణాలు అనేవి జీవుడిలో ఉంటాయి. వాటినిబట్టి జీవుడికి కొత్త శరీరం వస్తుంది. బుద్ధుడు ఈ భూమి మీదకు రాకముందు దేవుడికోసం మనుషులను బలి చేసేవారు. దానిని మానిపించటమే కాకుండా, సాటి మానవుడిని ప్రేమించండి అని బుద్ధుడు చెప్పాడు. దేవుడిపేరుమీద సమాజంలో జరుగుతున్న దోపిడీని బుద్ధుడు ఖండించాడు. దేవుడి పేరుమీద కాలక్షేపం చేయటంకంటే మీలోపలఉన్న శత్రువులమీద పోరాడి వాటిమీద విజయం సాధించండి, మీరు బాగుపడతారు అని బుద్ధుడు చెప్పాడు. బుద్ధుడు మహిమల్ని ఎప్పుడూ ప్రోత్సహించలేదు. బుద్ధుడు గొప్పమానవతావాది. అందుచేతనే ఆయన ఈనాటికి కూడా ప్రపంచం యొక్క హృదయాలలో ఉండిపోయాడు.

కోరిక, కోపము, లోభిత్వం, మోహము, మదము, మాత్సర్యము ఇవి అన్నీ మనలోపల ఉన్న శత్రువులు. వీరందరూ కలిసి జతగానే తిరుగుతూఉంటారు. వీరందరూ మీకు వేరువేరుగా కనిపించినప్పటికీ కోరికే మిగతా అవతారాలు ఎత్తుతోంది అని బుద్ధుడు చెప్పాడు. ఈశ్వరానుగ్రహం ఉంటేగాని మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. అయితే ఈశ్వరానుగ్రహం ఎలా కలుగుతుంది అంటే అది మీ ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుంది. కోరిక నెరవేరితే అహంకారం పెరుగుతుంది, అజ్ఞానం పెరుగుతుంది, దేహబుద్ధి పెరుగుతుంది, ఇది నేను సాధించాను అనుకొంటాడు అప్పుడు గర్వం వస్తుంది. కోరిక నెరవేరకపోతే కోపం వస్తుంది. మనకు అర్హత, యోగ్యత లేనిమూలంగా అది నెరవేరలేదు అని మనం అనుకోము. దానికి ఎవరో అడ్డువచ్చారు, వారు అడ్డురావటం వలన ఆపని జరగలేదు అని ఇతరుల మీద మనకు

ద్వేషం కలుగుతుంది. అందుచేత కోరిక మనలో అంతర్లీనంగా ఉన్నంతకాలం కోపం వస్తూనే ఉంటుంది అంటే కోరికే కోపానికి జన్మ ఇచ్చింది. కోరిక నెరవేరకపోతే చాలామంది బాధపడతారు కానీ అందులోకూడా మీకు లాభం ఉంది. ఎందుకు నెరవేరలేదు అని మీరు ఆలోచన ప్రారంభిస్తారు, విచారణ ప్రారంభిస్తారు, దాని వలన మనస్సు అంతర్ముఖమవుతుంది. కోరిక నెరవేరితే ఆలోచన పెరగదు, గర్వం పెరుగుతుంది.

ఒక పని అవ్వటం, అవ్వకపోవటం అనేది కేవలం ఈ జన్మమీదే ఆధారపడి ఉండదు. దీనికి పూర్వజన్మలకు సంబంధం ఉంటుంది. ఒక పుస్తకం మనం ఈరోజు రాత్రి 45వ పేజీ వరకు చదివి నిద్రపోతే రేపు ఉదయం ఒకటవపేజీ నుండి మొదలుపెట్టము, 46వ పేజీ నుండి చదవటం మొదలుపెడతాము అలాగే మనం చేసే సాధన కూడా పూర్వజన్మలో ఎక్కడ ముగిసిందో ఈ జన్మలో అక్కడ నుండి మన సాధన ప్రారంభమవుతుంది. అందుచేత మన పెద్దలు ఏమని చెప్పారు అంటే నువ్వు చేసిన కృషి వృధాపోదు, అది నీకు వృధా అయినట్లు అనిపించినా అది వృధా అవ్వదు. పెడితే పుడుతుంది అనే సామెత ఎందుకు వచ్చింది అంటే మీరు ఇతరులకు ఎవరికైనా ఒక పండు ఇస్తే వారికి పండు ఇచ్చాము అని మీరు అనుకొంటారు కాని అది తిరిగి మీకే వచ్చేస్తుంది అని మీకు అర్థమైతే ఇతరులకు ఇచ్చాము అనేటువంటి తలంపు ఇంక మీకు రాదు. అందరి హృదయాలలో అంతర్లీనంగా ఉన్న చైతన్యాన్ని మీరు చూస్తున్నప్పుడు భిన్నభావనరాదు.

కోరిక, కోపము, లోభిత్వము ఇవి మూడు నరకద్వారాలు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీ శరీరం చనిపోయిన తరువాత నరకానికి వెళతారా, స్వర్గానికి వెళతారా అని మీరు దీనినిబట్టే తెలుసుకోవచ్చు. మీకు మోహం ఉన్నప్పుడు మంచి చెడ్డకింద కనిపిస్తుంది, చెడ్డ మంచికింద కనిపిస్తుంది. ఉన్న వస్తువును ఉన్నట్లుగా చూడలేకపోవటానికి మోహమే కారణం. ధనం పెరిగినప్పుడు మదం పెరిగిపోతుంది. మనిషి కూడా నీడ ఎలా వస్తుందో అలాగ ధనం కూడా గర్వం వచ్చేస్తుంది. ధనం వలన వచ్చిన మదం వలన నువ్వు పతనమై పోతావు. నువ్వు పైకి అందరిలాగే బాగా ఉన్నప్పటికీ లోపల కుళ్ళిపోతావు. ధనం నిన్ను పాడుచేయదు, ధనం వలన వచ్చిన గర్వం నిన్ను పాడుచేస్తుంది, అది అనేక నీచజన్మలకు దారితీస్తుంది. పూర్వజన్మ సుకృతాన్నిబట్టి మీకు పరిస్థితులు ఒకవేళ అనుకూలంగా ఉన్నా అవి అన్నీ తాత్కాలికమే. దానిని బట్టి మదం పెంచుకోకూడదు. బాహ్యవిషయాలు అనుకూలంగా ఉన్నాయని మదం పెరుగుతూ ఉంటే, ఇటువంటి చిన్న విషయాలను నిగ్రహించుకోలేకపోతే మీకు మోక్షం ఎలా వస్తుంది? మాత్సర్యం అంటే అసూయ. ఇది మనకు ఎక్కువగా కనబడుతుంది. అమెరికాలాంటి దేశాలలో ఇది చాలా తక్కువ. పక్కింటి వాడికి వెయ్యికోట్లు ఉన్నా వారు పట్టించుకోరు, అసూయపడరు. అక్కడ ఎలక్షన్‌లో ఓడిపోతే మరల ఎలక్షన్ వచ్చేవరకు వారి పని ఏదో వారు చూసుకుంటారు. ఇక్కడ ఎలక్షన్‌లో ఓడిపోయినవాడు ఆ నెగ్గినవాడి కాలు పట్టుకుని కిందకు లాగేయాలని చూస్తూ ఉంటాడు, వాడికి ఇంకోపని ఉండదు. అసూయ అనేది మనలో ఎక్కువగా ఉంది.

నేను ఫలానా వ్యక్తిని అని ఇప్పుడు మీరు అనుకొంటున్నారు కదా! మీకు జ్ఞానం ఎప్పుడు వస్తుంది అంటే మీలో వ్యక్తి కనబడకూడదు. నేను ఫలానా వ్యక్తిని, ఈ శరీరం నాది, ఈ మనస్సు నాది, ఈ కుటుంబం నాది, నాకు ఇంత ధనం ఉంది, నాకు ఇంత గౌరవం ఉంది అనుకొంటున్నారు కదా, ఇవి అన్నీ ఎవరికి? మీరు ఒక వ్యక్తిగా భావించినప్పుడు ఇవి అన్నీ వస్తాయి. మీరు ఒక వ్యక్తిగా భావించినంతకాలం మిమ్మల్ని రంపం పెట్టి కోసేసినా మీకు జ్ఞానం రాదు. ఒక సద్గురువు సమక్షంలో, మహాత్ముడి సమక్షంలో, మహర్షి సమక్షంలో ఈ వ్యక్తిభావన అణిగిపోతుంది కాని కేవలం నీ సాధన వలన అది సాధ్యం కాదు. వ్యక్తిభావన ఉన్నంతకాలం సమానబుద్ధికి మనం కళ్ళు తెరవలేము. నీకు దుఃఖం ఎందుకు వస్తోంది? నువ్వు ఏదో శరీరానికి పరిమితమైనప్పుడు, మనస్సుకు పరిమితమైనప్పుడు, ఒక కులానికి, జాతికి పరిమితమైనప్పుడు, ఒక దేశానికి పరిమితమైనప్పుడు నీకు దుఃఖం వస్తుంది. పరిమితులు లేనివాడికి, హద్దులు లేనివాడికి దుఃఖం ఏమిటి? స్వ, పర భేదం లేనివాడికి అసలు దుఃఖం ఎక్కడనుండి వస్తుంది? వాడికి దుఃఖం రాదు. దక్షిణామూర్తి ఆయన దగ్గరకు శిష్యులు, భక్తులు వచ్చినప్పుడు ఆయన మాటలు చెప్పేవాడుకాదు, వారిని టచ్‌చేసే వాడు కాదు. ఆయన మౌనంగా ఉండటం వల్లనే వారిలో ఉన్న దేహభావన నశించేది, అది మహత్తర జ్ఞానం. వీరి సాధనతో సంబంధం లేకుండా, వీరి ప్రయత్నంతో పనిలేకుండా ఆయన సమక్షంలో ఉండటం వలననే వారు జ్ఞానం పొందటానికి అడ్డువచ్చే దేహభావన నశించేది.

మీరందరూ నాలోపల ఉన్నారుకాని నేను మటుకు మీలో ఎవరిలోను లేను అని పరమాత్మ చెప్పాడు. పరమాత్మ చెప్పిన ఈ వాక్యం అర్థమైతే దేహబుద్ధి నశిస్తుంది. నన్ను నన్నుగా చూడలేక అంటే నేను ఎలాగ ఉన్నానో అలాగ చూడలేక నన్ను మీరు దేహంగా, జీవుడిగా, ప్రపంచంగా చూస్తున్నారు. నన్ను నన్నుగా మీరు చూడగలిగితే ఇంక జీవుడు లేడు, ప్రపంచం లేదు, బంధం లేదు, మోక్షం లేదు, ఏమీ లేదు. ఇంక నిగ్రహం దేనికి? మనస్సు ఉంటే నిగ్రహంకాని మనస్సులేని వాడికి నిగ్రహం ఏమిటి? ఈ దేహాలు, ఈ లోకాలు, సమస్త జీవకోటి నాలో కల్పించబడ్డాయి. నన్ను చూడటం మానేసి మీరు నాలో ఉన్న వాటిని చూస్తున్నారు. నేను ఎలాగ ఉన్నానో అలాగ చూడలేకపోవటం వలన అవి అన్నీ మీకు కనిపిస్తున్నాయి. నేను ఎలాగ ఉన్నానో అలాగ నన్ను మీరు చూడగలిగితే ఇవి ఏమీ లేవు అని మీకు అర్థమవుతుంది. అప్పుడు నిగ్రహం లేదు, ఆగ్రహం లేదు. ఆ నేను ఎటువంటిది అంటే అది ముగింపులేని నేను, అనంతమైన నేను అని పరమాత్మ చెపుతున్నాడు. గాఢనిద్రలో ఉండగా ప్రపంచంలేని స్థితిలో, జీవలక్షణాలు లేని స్థితిలో కూడా ఆ నేను ఉన్నాడు. వాడియందే నీ శరీరం, మనస్సు, ప్రపంచం అంతా కల్పించబడింది. ఆ కల్పితం, కల్పితంగా నీకు అర్థమయినప్పుడు, అసత్యం అసత్యంగా నీకు గోచరించినప్పుడు మాత్రమే నీకు సత్యానుభవం కలుగుతుంది. అప్పటివరకు నీకు ప్రయాణాలు తప్పవు, జననమరణాలు తప్పవు. నేను పిలిచేవరకూ ఈ భూమి మీద అలా పడి ఉండండి అని అల్లా చెప్పాడు. నేను ఎప్పుడు పిలుస్తానో చెప్పలేను. నా పిలుపు వచ్చేవరకూ అలా చస్తూ పుడుతూ ఈ భూమి మీద పడి

ఉండండి అని చెప్పాడు. మీ ప్రవర్తన నా అనుగ్రహానికి అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే, నా దయకు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే నా దయ మీకు కలుగుతుంది. అప్పుడు నా దగ్గర నుండి మీకు పిలుపు వస్తుంది. అంతవరకూ ఏవో కర్మలు చేస్తూ, వాటిని మోస్తూ ఈ భూమి మీద అలాపడి ఉండవలసిందే అని చెప్పాడు. ఉన్నది ఉన్నట్లుగా సబ్జక్టు చెప్పటమే తప్ప అల్లా ఎప్పుడు మహిమలజోలికి వెళ్ళడు. గ్రౌండురియాలిటీస్ విడిచిపెట్టి ఒక్కమాట కూడా మాట్లాడడు. ఏవో మహిమలు చేసి, గారడీలు చేసి మిమ్మల్ని ఆకర్షించడు. మీరు మింగలేక ఊసేసినాగాని కఠోరమైన సత్యాలను మీ ముందు ఉంచుతాడు. వాడు అల్లా.

ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకొని జ్ఞానం సంపాదించాలి అనే బుద్ధి మనకులేదు. ఏవో పుణ్యకార్యాలు చేద్దాము అనుకొంటున్నాము. పుణ్యకార్యాలు చేయటం వలన మీ మనస్సుకు చల్లదనం వస్తుంది. దేహానికి సుఖం వస్తుంది. అంటే పుణ్యకార్యాలకు కూడా ఫలితం ఉంది, అది సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది. పాపకార్యాలకు ఫలితం ఉంది, అది దుఃఖరూపంలో ఖర్చుఅయిపోతుంది. మీరు చేసిన పుణ్యం ఖర్చు అయిన వెంటనే సుఖం ముగిసిపోతుంది, మీరు చేసిన పాపం ఖర్చు అయిన వెంటనే దుఃఖం ముగిసిపోతుంది. అంటే దానికి దీనికి కూడా ముగింపు ఉంది. అయితే ముగింపు లేని సుఖం, ముగింపు లేని ఆనందం ఎక్కడ ఉంది అంటే నీ స్వరూపమైన సత్యంలోనే ఉంది. నువ్వు చేసిన పుణ్యం నిన్ను అజ్ఞానంలో నుండి, దుఃఖంలోనుండి విడుదల చెయ్యలేదు. నువ్వు సత్యానుభవం పొందితే నీ స్వరూపంలో ఉన్న సత్యం మాత్రమే నిన్ను వాటిలో నుండి విడుదల చేస్తుంది. అంతవరకూ ఈ దేహంలోనుండి, మనస్సులోనుండి, ప్రపంచంలోనుండి, నీ ఇష్టాలు అయిష్టాలనుండి నీకు ఫ్రీడమ్ లేదు.

మన హృదయంలో ఒక సత్యం ఉంది. మహాత్ముల యొక్క, మహర్షుల యొక్క సన్నిధిలో ఉన్నప్పుడు మన హృదయంలో సత్యం ఉందని మనకు సూచన ప్రాయంగా తెలుస్తూ ఉంటుంది. లేకపోతే అది మన హృదయంలో ఉందని కూడా మనకు తెలియదు. సత్యం మన హృదయంలో ఉందని తెలిసాక కూడా దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి మనకు తగిన అర్హత ఉండాలి. కాశీ ఉందని తెలుసుకొన్నంతమాత్రంచేత మనం కాశీ వెళ్ళిపోతామా? కాశీ చేరుకోవటానికి మనం ప్రయాణం చేయాలికదా! అలాగే మన హృదయంలో సత్యం ఉన్నప్పటికీ భగవంతుని అనుగ్రహం వల్లే దానిని తెలుసుకోవాలనే బుద్ధి మనకు కలుగుతుంది, ఆయన అనుగ్రహం వలన మాత్రమే అది మనకు తెలియబడుతుంది కాని మన ప్రయత్నం వలన దానిని తెలుసుకోలేము. అయితే ఆయన అనుగ్రహం సంపాదించటానికి అనుగుణంగా మన జీవితవిధానం ఉండాలి. సత్యాన్ని తెలుసుకోవాలి అని ఎవరి అనుగ్రహం వలన మనకు కలిగిందో, ఆ అనుగ్రహమే పరమస్థితికి చేరేవరకు మనలను వెంటాడుతుంది. అయితే ఈలోపుగా మన జీవితాన్ని అనేక మలుపులు తిప్పుతూ ఉంటాడు, మనం తినవలసిన మొట్టికాయలు తింటూ ఉంటాము. ఏమిటి ఇలా జరుగుతోంది అని మీరు అనుకొంటారు. మీ ఆధ్యాత్మిక పురోగతికోసమే అలా తిప్పుతూ ఉంటాడు. మిమ్మల్ని ఏమైనా బాధలకు గురి

చేసినా మీ మనస్సులో ఉన్న కల్మషాన్ని కక్కించటానికి అలా చేస్తాడు కాని మీ మీద కోపం వలన కాదు. ఇదంతా భగవంతుడికి తెలియకుండా రావటంలేదు, మన బాగుకోసమే ఇదంతా చేస్తున్నాడు అని తెలుసుకొన్నవారు అదృష్టవంతులు. ఆయనచేత ఎవరైతే చంపబడ్డారో వారికి తన స్వరూపాన్ని ఇచ్చాడు, వాడు భగవంతుడు, ఆయనకు శత్రుత్వం ఏమిటి?

కృష్ణుడు ధర్మరాజును ఒక చిన్న అబద్ధం చెప్పమన్నాడు. నేను చెప్పను అన్నాడు ధర్మరాజు. నేను ఎవడిని? అని అడిగాడు. నువ్వు దేవుడవని నాకు తెలుసు, దేవుడు చెప్పమన్నా చెప్పను అన్నాడు ధర్మరాజు. ఇక్కడ ధర్మరాజు యొక్క చూపు దేహానికి పరిమితమై ఉంది. ధర్మరాజు అంటే ధర్మాన్ని ఆచరించేవాడు అని అందరిచేత అనిపించుకోవాలని చూస్తున్నాడు. ఈ ప్రపంచంలో ధర్మాన్ని స్థాపించటానికి పరమాత్మ వచ్చాడు. ఆ పనిలో చిన్న అబద్ధం చెప్పమన్నాడు. అందులో పరమాత్మకు స్వార్థం లేదు. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసింది ఏమిటిఅంటే మనం భగవంతుడు అంతటి వాళ్ళము అయితే కాని ఆయన మనకు అర్థంకాడు. మనకు ఉన్న చిన్నమనస్సుతో ఆలోచిస్తూ ఉంటే గ్రేట్ ట్రూత్స్ మనకు ఎలా ఆవిష్కరింపబడతాయి? కృష్ణుడు అంటే ఒక వ్యక్తికాదు, ఆయన పరమాత్మ, మన చిన్న మనస్సుకు ఆయన అర్థం కాడు. ఒక మహాత్ముడు కాని, ఒక ఋషికాని ఆయన మౌనంగా ఉన్నప్పటికీ ఆయన సమక్షంలో మనం కూర్చున్నప్పుడు ఆయన మాటలతోటి, చూపుతోటి సంబంధం లేకుండా మనలో ఉన్న సందేహాలు అన్నీ పటాపంచలు అయిపోతాయి. ఆన్ ది స్పాట్ అంటే ఎప్పుడో మీరు సాధన చేసాక కాదు, మీరు అక్కడ కూర్చుని ఉండగానే మీలో ఉన్న అనుమానాలు, సందేహాలు అన్నీ పోతాయి, దేహభావన నశిస్తుంది. దేహభావన ఎప్పుడైతే పోయిందో దానితోవచ్చే చెత్త అంతా కూడా కాలి బూడిద అవుతుంది. అది మహాత్ముల యొక్క సన్నిధి.

ఇక్కడ పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే నేను నీకు అసత్యం కింద కనిపిస్తున్నాను. నాలో కల్పించబడినవి నీకు సత్యంగా కనిపిస్తున్నాయి. అంటే సత్యం నీకు అసత్యంగా కనిపిస్తోంది. సత్యాన్ని సత్యంగా చూసే శక్తి నీకు లేనప్పుడు అసత్యం సత్యంగా నీకు కనిపిస్తుంది. నువ్వు ఈ జీవకోటి నిజం అనుకొంటున్నావు, లోకం నిజం అనుకొంటున్నావు, నేను అబద్ధం అనుకొంటున్నావు. నేను నిజం అని నీకు అనిపించినా అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడుకదా ఇవి అన్నీ అబద్ధాలు అని నీకు తెలిసేది. ఎంత లోతులలోనికి వెళ్ళి పరమాత్మ చెపుతున్నాడో చూడండి. అసలు నువ్వే లేనప్పుడు ఇంక నిగ్రహంతోటి పని ఏముంది? మీరు ఉంటే పుణ్యాలు, పాపాలు, చెట్లు చుట్టూ తిరగటాలు, నదులలో మునగటాలు. అసలు మీరే లేరని మీకు అర్థమైనప్పుడు ఇంక పుణ్యం ఏమిటి? పాపం ఏమిటి? మీలో వ్యక్తిభావన ఉన్నప్పుడు ఇతరులు కూడా వ్యక్తులగానే మీకు కనిపిస్తారు. మీచేత చూడబడేది లోకంగా కనిపిస్తుంది. ఇవన్నీ మనోకల్పితాలు. ఒక్క సత్యం తప్పించి మిగతా అంతా కూడా మనస్సు కల్పించిన దుమ్ము. మనం రాజభవనంలో ఉన్నట్లు స్వప్నం

వచ్చింది అనుకోండి. స్వప్నం జరుగుతున్నంతసేపు అవి అన్నీ నిజంలాగే ఉంటాయి. స్వప్నంలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చాక నువ్వు రాజభవనంలో కాపురం చేస్తున్నావా అంటే నువ్వు నమ్ముతావా? జాగ్రదవస్థలోనికి వచ్చాక అది అంతా అబద్ధం అని నీకు అర్థమైపోతుంది. జాగ్రదవస్థలోనికి వచ్చాక స్వప్నంలో జరిగినదంతా అసత్యం అని మనకు ఎలా తెలుస్తుందో అలాగే నువ్వు పరమాత్మవైపుకు మేలుకొంటే, సత్యవస్తువు వైపుకు నువ్వు కళ్ళు తెరిస్తే ఇప్పడు నువ్వు నిజం అనుకొనే ఈ సృష్టి అంతా కూడా అసత్యం అని నీకు తెలుస్తుంది. అప్పడు ఇంక మోహించటానికి ఎవరు ఉన్నారు? నిగ్రహించుకోవటానికి ఏముంటుంది? నువ్వు ఉంటే కదా నిన్ను నువ్వు కంట్రోలు చేసుకోవటం, నువ్వేలేవని నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఇంక ఎవడిని కంట్రోలు చేస్తావు?

జన్మలతరబడి, యుగాల తరబడి మేము ఇలా చెపుతున్నప్పటికి, మీరు శ్రవణం చేస్తున్నప్పటికీ అమనస్కస్థితికి చేరినవాడి వీక్షణం వలన ఒక్క క్షణంలో మనలో ఉన్న అజ్ఞానం నశించిపోతుంది. అంటే జ్ఞానియొక్క మౌనస్థితిలో ఒక్క క్షణంలో మీలో ఉన్న అజ్ఞానం నశిస్తుంది. మీ శరీరం చనిపోయినప్పడు కూడా ఆ శరీరానికి నాకు సంబంధం తెగిపోతుంది కాని నేను ఉంటాను అనే అనుభవం ఒక్క క్షణంలో కలుగుతుంది, అది జ్ఞానియొక్క వైభవం. మీరు సంవత్సరాల తరబడి ఉపన్యాసాలు శ్రవణం చేస్తూ ఉండవచ్చు. వాటికి అసలు విలువ లేదు అని కాదు. జ్ఞాని యొక్క మౌనశక్తి ముందు ఈ మాటల ప్రభావం ఏపాటిది? జ్ఞాని యొక్క మౌనంతో, ఒక మహాత్ముడి యొక్క సన్నిధిలో పొందే లాభంతో పోల్చుకొన్నప్పడు ఈ ఉపన్యాసాల యొక్క ప్రయోజనం లేదు. అమనస్కస్థితిలో నుండి వచ్చే మౌనభాష అన్నింటికంటే ఉదాత్తమైనది, ఉన్నతమైనది.

ఎన్ని ప్రయత్నాలు చేసినా నా మనస్సు అంతర్ముఖం అవ్వటంలేదు అని చాలామంది అంటూ ఉంటారు. ఏ జీవుడిమీద ఈశ్వరుని దయ కలిగిందో వాడు మాత్రమే అంతర్ముఖ మవుతాడు. ఈశ్వరుని యొక్క అనుగ్రహం లేకుండా ఆ జీవుడు అంతర్ముఖమయ్యే సమస్య లేదు. అయితే ఈశ్వరుని దయ ఎలా కలుగుతుంది అంటే ఆయన చెప్పినమాటకు అనుగుణంగా నీ జీవితాన్ని సరిదిద్దుకొన్నప్పడు ఆయన దయ నీకు కలుగుతుంది. భగవద్గీత చదువుతూ ఉంటే అసలు ఆ వాక్యంమీద మనకు గౌరవం ఉందా? ఆ వాక్యం మీద మనకు విశ్వాసం ఉందా? అసలు నీ తలంపు, మాట, చేత ఒకటిగా ఉన్నాయా? ఈ మూడింటికి సమన్వయం లేనప్పడు మీకు ఈశ్వరునిదయ ఎలా కలుగుతుంది? నువ్వు ఒక పని చేస్తే లోకంలో గొప్పలకోసం ఆ పని చేస్తున్నావా లేక ఈశ్వరుని దయ సంపాదించటానికి ఆ పని చేస్తున్నావా? లోకంలో గొప్పలకోసం నువ్వు పనులు చేస్తే నీకు కీర్తి వస్తుంది కాని ఈశ్వరుని దయ నీకు రాదు. పోనీ ఆ కీర్తి నిలబడుతుందా అంటే అది నిలబడదు.

జ్ఞాని ఏ పనిచేసినా అది మౌనంలోనే జరుగుతూ ఉంటుంది. నీకు ఏదైనా ఉపకారం చేస్తున్నా నీ ప్రక్క వాడికి తెలియాలి అని ఆయన అనుకోడు. అలా అనుకునేవాడు అక్కడలేడు, వాడు ఉంటే అనుకోకుండా ఉండలేడు. నన్ను ఎవరు అనుకొంటున్నావు? అని

ధర్మరాజును కృష్ణుడు అడిగినప్పుడు నువ్వు దేవుడివే అంటాడు. మరి దేవుడు చెప్పినట్లు ఎందుకు చేయటం లేదు అంటే దేవుడిని అంగీకరిస్తున్నాడు కాని అక్కడ వ్యక్తిభావన ముఖ్యం. అక్కడ వ్యక్తి కనిపించినప్పుడు దేవుడు కనబడడు, దేవుడు కనిపించినప్పుడు వ్యక్తి కనబడడు. ఆయన దేవుడే అన్న అనుభవం ధర్మరాజుకు ఉంటే అక్కడ ధర్మరాజు అనేవ్యక్తి కనబడడు. అప్పుడు ధర్మరాజు కృష్ణుడి చేతిలో పనిముట్టు అవుతాడు. దేహభావన వలన ఆయన చేతిలో పనిముట్టు అవ్వలేకపోతున్నాడు, అది మనం గ్రహించాలి. ఈశ్వరుడు అంటే శక్తి స్వరూపుడు. మనుషులు ఎలా తయారయ్యారు అంటే నేను మిమ్మల్ని భరిస్తాను అని పరమాత్మ చెప్పినప్పటికీ ఏమో భరించలేడేమో, మన బరువు మొయ్యలేక కిందపడేస్తే నెత్తి పగిలిపోతుంది అని వీరికి అనుమానం. అంటే ఆయన శక్తిమీద మనకు నమ్మకం లేదు. ప్రపంచాన్ని అంతా నడిపేవాడు, ప్రపంచం యొక్క బరువు మోసేవాడు మన బరువు మోయలేడా? దేహభావన వలన ఇటువంటి అనుమానాలు వస్తాయి. అది అంత తేలికగా పోదు.

అమనస్కస్థితిలో నుండి వచ్చే మౌనం పరిపూర్ణంగా ఉంటుంది. అది మీలో పూర్తిగా మార్పును తీసుకొనివస్తుంది. ఎంతో పురోగమించిన సాధకుడికిగాని ఆ మౌనం అర్థంకాదు. సూక్ష్మబుద్ధి ఉన్నవాడికి మాత్రమే భగవంతుడిమౌనం అర్థమవుతుంది. స్థూలబుద్ధి ఉన్నవాడికి అది అర్థం కాదు. స్థూలబుద్ధి ఉన్నవారిని కూడా వదిలేయకుండా వారికోసం భగవంతుడు మాటలు చెపుతున్నాడు. తప్పిపోయిన గొఱ్ఱెలు అంటే నాకు బాగా ఇష్టం అని ఏసు అన్నాడు. అంటే మొద్దబ్బాయిలు అంటే ఎక్కువ ఇష్టం. మరి వారిని కూడా బాగుచేయాలి కదా! ఆధ్యాత్మికంగా మీరు ఎక్కువ కృషి చేయలేకపోయినా సత్పురుషులతో సహవాసం వలన, వారితో మానసిక అనుబంధం వలన, అక్కడ ఉన్న మానసిక వాతావరణం వలన మీరు జ్ఞానాన్ని పొందటంకాదు, జ్ఞానమే మీ దగ్గరకు వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. హోలీ కంపెనీకి అంత శక్తి ఉంది. సద్వస్తువు తాలూక ఎరుక మీకు లేకపోయినా దాని తాలూక ఎరుక ఉన్నవారితోటి సహవాసం చాలా ముఖ్యం. ఆత్మకాముడికి ఇది తప్పనిసరి. ఆత్మ తప్పించి నాకేమీ అక్కరలేదు అనేటువంటి వాంఛ ఉన్నప్పడే దాని దయకు నువ్వు పాత్రుడవు అవుతావు. ఆత్మకామం నీకు ఉండవచ్చు. అది చిందిపోకూడదు. ఇతర కామాలు ఉంటే అది నీకు తెలియబడదు. ఆత్మకామం తప్పించి ఇతరకామాలు రవ్వంతకూడా ఏమీ లేనప్పడు మాత్రమే ఆత్మ మీకు ఎరుకలోనికి వస్తుంది. సత్పురుషుల సహవాసం మాత్రమే సంసార సముద్రంలో నుండి బయటకు రావటానికి నీకు నావలాగ ఉపయోగపడుతుంది. అందుచేత సద్వస్తువు అనుభవం ఉన్నవారు నీకు సమీపంలో లేకపోయినా వారు ఎక్కడ ఉన్నారో అన్వేషించు, వారితో సాంగత్యం చేయటానికి ప్రయత్నించు. లోచూపు లేకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. సజ్జనసాంగత్యం వలన నీకు లోచూపు కలుగుతుంది కాని ఇతర చిట్కాల వలన కలుగదు. మీకు సొంతంగా సాధన చేసుకొనే శక్తి తక్కువగా ఉన్నప్పడు సత్పురుషుల సహవాసం వలన తొందరగా జ్ఞానం అనే నిప్ప అంటుకొంటుంది, అప్పడు మీలో ఉన్న అజ్ఞానం కాలిబూడిద అయిపోతుంది.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

ఏప్రియల్ 19 జిన్నూరు శ్రీరమణ క్షేత్రం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## నేను ఎక్కడికి పోగలను?

పరమగురువు భగవాన్ శ్రీ రమణమహర్షి తమ పార్థివ శరీరాన్ని ది॥ 14-04-1950న విడిచిపెట్టిన కారణంగా, ఏప్రియల్ నెల అనగానే రమణభక్తులకు ఆయన భౌతిక శరీరం మన నుండి దూరమైన రోజు స్ఫురిస్తుంది. భగవాన్ దేహం భౌతికంగా మన నుండి దూరమైనప్పటికీ, వారి పరమ ఉనికి దేశ, కాల, జనన, మరణాలనే కల్పిత భ్రాంతులను అతిక్రమించి సర్వవ్యాపకంగా నిరంతరంగా ఉంది. భగవాన్ తమ 17వ సంవత్సరంలో మరణానుభవం ద్వారా స్వరూప అమృతస్థితిని అనుభవైకవేద్యం చేసుకొన్నారు. మరణానుభవం భగవాన్‌కి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించింది. పిమ్మట 01-09-1896న వారి ఉపాధి పవిత్ర అరుణాచలం చేర్చబడినతరువాత, 54 సంవత్సరములు అరుణాచల క్షేత్రం కేంద్రంగా, బలమైన అయస్కాంతంలాగ జీవకోటిని ఆకర్షించి, తమ మౌనము, బోధ, చూపు, చేతల ద్వారా హృదయాభిముఖులను చేసారు. భగవాన్ దేహం విడిచిపెట్టే సమయంలో మీరు లేకపోతే మాగతి ఏమిటి? మమ్మల్ని ఎవరు అనుగ్రహిస్తారు? అని భక్తులు వేడుకోగా, అందుకు భగవాన్ నేను ఎక్కడికి పోయెదను? నేను ఎక్కడికి పోగలను? ఇక్కడే ఉంటాను! అని బదులిచ్చారు. దేహం ఉన్నప్పడు కూడా మిమ్ము అనుగ్రహించేది జడమైన దేహంకాదు, మరి అనుగ్రహమో నిరంతరం ఉండేదే! అదే ఆత్మ! ఆత్మకు దేహం ఉండడంతోటి, లేకపోవటంతోటి, ఎట్టి సంబంధము లేదు అన్న భగవాన్ మాటలే మహామంత్రాలు. భగవాన్ మనకు బోధించినది సత్యమార్గం, సూటిమార్గం మరియు ప్రత్యక్షమార్గం. వారు తమ బోధద్వారా తత్త్వసారాన్ని మనకందించారు. భగవాన్ దృష్టిలో దేవుడున్నాడా? లేడా? అన్నది ప్రశ్నకాదు. అసలు మనము దేవునికన్న వేరుగా ఉన్నామా? అన్నదే ప్రశ్న. కావున నీవెవరివో? తెలుసుకో అంటారు భగవాన్. భగవాన్ శరీరము మన నుండి దూరమై 62 సంవత్సరములు అయినప్పటికీ, వారి పరమ ఉనికి నిరంతరంగా, ప్రస్ఫుటంగా అనుభూతమవుతూనే ఉంది.

**- చావలి సూర్యనారాయణమూర్తి**, అమలాపురం

# "నేను ఎవఁడను?"

ఈ సృష్టిలో ప్రతీ జీవి దుఃఖ స్పర్శలేని సుఖాన్ని కోరుకుంటుంది. అది మన ఆత్మలో నుంచే రావాలి. బాహ్యవస్తు సముదాయాల్లోంచే లభించే సుఖం క్షణికం. కాని అందు సుఖం లేదు. ఉందని భ్రమిస్తాము. నా శరీరం, నాసంపద, నా ప్రతిష్ట, నా సంబంధ బాంధవ్యాలు, నా కట్టుబాట్లు నా నమ్మకాలు, నా ఆలోచనలు, ఇవి అన్నీ కలిపి 'నేను' అన్నదిగా, జీవితంగా తయారు అయిపోయింది. మృత్యువు ఈ నేను తీసుకొని పోతుంది. అదే ఉన్న ఏకైక భయం, ఇవి అన్నీ నిజమైన 'నేను' కాదని వీటికి భిన్న మైన ఆత్మ నేను అని గురువాక్యాన్ని విశ్వసించితే భయం మాయమైపోతుంది. నిజానికి మన హృదయంలో ఒంటరియే దానిలో మనకు అనుభవం లేక భయం ఏర్పడింది. నేను అన్నది మనస్సు చేసే ఉత్పత్తి. నాకు మోకాళ్లనెప్పలు, రొంప, జ్వరం అన్న మాటలు శరీరానికి సంబంధించినది ఆత్మ ఎట్టి సంబంధంలేదు 'కాలం'కూడా మనో కల్పితమే. నేను అన్నదానివల్లనే చైతన్యం తెలయబడటం లేదు. ఉన్నది చైతన్యమే కాని ఏదో పోగొట్టుకొన్నామని అనిపిస్తుంది. ఆలోచనలు అన్నీ ఉత్పత్తి స్థానంలోనే ఆపుచెయ్యాలి. వైరాగ్యం అలవరుచుకోవాలి. అప్పుడే చైతన్యాన్ని ఎరుక పరుచుకోగలము. సంపద, సౌందర్యం నీడలా మారుతూ ఉంటాయి. మారే పదార్థాలమీద దృష్టి ఉంచక, మారని దానిపై నిరంతరం దృష్టి నిలపాలి. 'నేను' అన్న భావన ఉన్నంతకాలం భూమికొలతలు, సంపద కొలతలు ఉంటాయి. ఈ ప్రకృతి సంపద ఈశ్వరునిది. మన జాగ్రత్తలో మనం ఉండాలి. నాకు ఉన్న ఊహాప్రతిమలతో, నాకు కలిగిన కాలంయొక్క గాయాలతో , నాకు ఉన్న గర్వంతో, పేరాశతో భయాలతో'నేను' రూపొందింది. 'నేను' అనేది కొలవటానికి కేంద్రబిందువు. అదే ఘర్షణలకు, కేంద్రస్థానం. దాన్ని 'నేను ఎవఁడను?' అనేవివేకంతో కూడిన ప్రశ్నతో అంతం చెయ్యాలి. భగవాన్ "ఇతరులు ఎంత దుర్మార్గులైనా వారి విషయంలో ద్వేషం పెట్టుకోరాదు. అంతా ఈశ్వర ప్రణాళిక ప్రకారం జరుగుతున్నది. దాన్ని తానుగా జరగనియ్యాలి" అన్నారు. శ్రీ నాన్నగారు "ఈశ్వరునికి తెలియకుండా ఏమీ జరుగదు. దాన్ని గురించి చెమటలు పట్టించుకొని నిద్రపోకుండా చేసుకోకండి శుభ్రంగా నిద్రపొండి" అన్నారు. సూర్యకాంతి వల్ల పద్మం వికశిస్తుంది. అలాగే మన కర్మలు కర్త అయిన ఈశ్వరుడు ఫలింపచేస్తున్నాడు. దాన్ని మనం తప్పించుకోలేము. ఈ రహస్యము మన గుండెలకు పడితే జరిగే పరిణామాలను చూస్తూకూర్చోవటమే మన వంతు. అంటే మన పరిధిలో మనం చెయ్యవలసినది చేసి ఈశ్వరునిపై భారం వెయ్యటమే మనవంతు. అదే వివేకం. పని చెయ్యాలి. ప్రతీకారం చెయ్యకుండా ఉంటే కర్మల భారం తిరిగి అంటుకోదు. గురువుకు శ్రమ కలిగించకూడదు. ఫలితాలపట్ల నిరాశ, నిర్లిప్తిత సాధకునకు శ్రీరామరక్ష. తెలివి వల్ల, యుక్తి వల్ల ప్రారబ్ధాన్ని తప్పించుకోలేము. విధి చేతుల్లో మనం కీలుబొమ్మలము, బలిపశువులము అందుకే భగవాన్‌బోధ "ఊరక ఉండు, నేను దైవమని ఎరుంగుము" అన్నారు. జాగ్రత్, స్వప్న అవస్థలు లేవని ఈ కనిపించేది అంతా దృశ్యమానమని ఉన్న సత్యం ఒక్కటే అని ఆత్మనీడలో సుఖంగా జీవించు" అన్న గురువాక్యాన్ని అనునిత్యం స్మరిస్తే పవిత్రులమై మనమెవరమో మనం తెలుసుకొని సుఖిస్తాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం